క్లుప్తంగా

ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



లైనుకొత్తూరులో ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ప్రజలకు అందిస్తున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి : ప్రజా సంక్షేమం ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు.మండలంలో రెండవ రోజు శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలో లైనుకొత్తూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా జరిగిన లబ్ధిని ప్రజలకు తెలియజేసి వివరించారు. ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, అధికారంలోకి తేవడానికి కృషి చేయాలని కోరారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నినాదాలు చేస్తున్న మహిళలు

రాంబిల్లి : మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల ఐద్వా కార్యదర్శి మంగతాయారు డిమాండ్ చేశారు. అప్పారాయుడుపాలెం గ్రామంలో శనివారం పలువురు మహిళలతో కలిసి ఆమె నిరసన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. నక్కపల్లి మండలం చినతీనార్లలో ఘటన చోటుచేసుకుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

19వ రోజుకు చేరుకున్న భిక్ష కార్యక్రమం



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులకు భిక్ష పెడుతున్న దృశ్యం

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఏటా అయ్యప్ప భక్తులతో పాటు ఇతర భక్తులకు మధ్యాహ్నం సమయంలో ఆలయ ప్రాంగణంలో భిక్ష సదుపాయం కల్పిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా అక్టోబర్ 25న దాతల సహకారంతో భిక్ష సదుపాయాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. 50 రోజుల పాటు భిక్ష అందించేందుకు నిర్వాహకులు నిర్ణయించారు. ఇదిలా ఉండగా పలువురు దాతలు ముందుకొచ్చి భిక్షకు అవసరమయ్యే విరాళాలు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు.

రక్షణభేరిని విజయవంతం చేయాలి



వాడనర్సాపురంలో ప్రచార పోస్టర్‌ను అందజేస్తున్న దేముడునాయుడు

రాంబిల్లి: ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే రక్షణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు కోరారు. వాడనర్సాపురం, చినకలవలాపల్లి గ్రామాల్లో శనివారం ఆయన కరపత్రాలు, గోడపత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు రకాల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈ రక్షణభేరి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



వేమగిరి గ్రామంలో నివాళులు అర్పిస్తున్న సమతాసేవాదళ్ సభ్యులు

ఎస్.రాయవరం : దళితులంతా ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని సమతాసైనిక్ సభ్యులు ప్రకాష్‌రావు అన్నారు. శనివారం వేమగిరి గ్రామంలో సమావేశమయ్యారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని రచించారని, ప్రతి ఒక్కరూ చదువులో మంచి ప్రగతి సాధిస్తే ఆర్థికంగా ఎదగవచ్చన్నారు.

అందాల ప్రమిదలు-ఆనందాల కాంతులు



మట్టి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ప్రధాన రహదారి పక్కన అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మట్టి ప్రమిదలు

- మార్కెట్లో దీపావళి కళ
- వివిధాకృతుల్లో ప్రమిదలు
- దీపావళి విక్రయాలతో సందడి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): దీపావళి అంటే వెలుగుల పండుగ. ఇళ్లల్లో దీపాల వరుస కళకళలాడుతాయి. ఈ పండుగలో దీపమే ప్రధానపాత్ర వహిస్తోంది. ఇందుకోసం సాధారణ దీపాలతో పాటు కొత్తరకం దీపాలను కూడా వెలిగించేందుకు మహిళలు ఆసక్తి చూపుతారు. అలాంటి వారి కోసం యలమంచిలి పట్టణం, మండలంలో మార్కెట్లో సాధారణ రకంతో పాటు పలు డిజైన్లతో దీపాల ప్రమిదలు విక్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో స్థానికంగా తయారైన ప్రమిదలతో పాటు చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో భిన్నంగా వుండే ప్రమిదలను కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్రమిదల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. ఏటా ఈ పండగ కోసం ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రహదారి కూడళ్లల్లో ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతాయి. చెన్నై నుంచి తెచ్చిన రక,రకాల కళ్లు చెదిరే డిజైన్లు వుండడంతో స్థానికులు వాటి పట్ల ఆకర్షితులవుతున్నారు. దీపావళిని పురకరించుకుని తాము కోరే కళాత్మక రూపాల్లో దీపాలను వెలిగించుకోవాలని మహిళలు ముచ్చటపడుతుంటారు. మట్టి దీపాలకు ఆదరణ తగ్గడంతో స్థానిక కుమ్మర్లలో కొందరు ఇతర రాష్ట్రాల నుంచి కళాత్మకమైన ప్రమిదలను తెచ్చి విక్రయిస్తున్నారు. కళాత్మకంగా వున్న ప్రమిదల్లో దీపం వెలిగిస్తే తమ ఇంటికి శోభ చేకూరుతుందన్న నమ్మకంతో వీటిని కొనేందుకు కూడా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. డజను రూ.40 నుంచి రూ.80 ధరల్లో అందుబాటులో వున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి మున్సిపల్ స్టేడియం పరిసరాలు, కాకివాని వీధి , దిమిలి రోడ్డు జంక్షన్ ఇలా అనేక ప్రదేశాల్లో రహదారుల పక్కన గుట్టలుగా పోసిన ప్రమిదలను విక్రయిస్తున్నారు. కొందరు తోపుడు బండ్లపై వీధుల్లో తిరుగుతూ కూడా ప్రమిదలను విక్రయిస్తున్నారు. ప్రమిదల్లో నూనె ఎక్కువగా పీల్చని టెరక్రోటా రకాలనే కొనేందుకు మక్కువ చూపుతున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్తీకమాసంలో నాలుగు వారాలు పూర్తిగా దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తారు. కనుక మహిళలు ముందు జాగ్రత్తతో కళాత్మకమైన ప్రమిదలను కొంటున్నారు. వీటిలో నూనె కొద్దిగా లోపలకి ఇంకినా, వత్తిలో నూనె అయిపోయిన తరువాత కూడా మరికొంతసేపు దీపం వెలుగుతుంది. దీంతో వాడవాడలా దీపావళి వెలుగులు కనబడుతున్నాయి. ప్రమిదలు,బొమ్మల కొనుగోళ్లతో పాటు పిల్లలు, పెద్దలకు ఇష్టపడే బాణసంచా కొనుగోళ్లతో మార్కెట్లో సందడి కన్పించింది.

మట్టి ప్రమిదలు సంప్రదాయం



దీపావళికి మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో చిన్న చిన్న ప్రమిదల్లో వెలిగించేవారం. మారుతున్న కాలంతో పాటు దీపావళికి ప్రత్యేకంగా వివిధ రకాల డిజైన్లతో ప్రమిదలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని చూడగానే ఆకర్షిస్తున్నాయి. ధర ఎంతైనా కొనాలనిపిస్తోంది. ఇప్పుడే మార్కెట్‌కు వెళ్లి ప్రమిదలు కొనుక్కొచ్చాను.

సీహెచ్ లక్ష్మి, అధ్యాపకురాలు, రాంనగర్, యలమంచిలి

సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఆనందం



పథకాల బ్రోచర్లను, హామీల పత్రాలను పంచుతున్న పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమంలో భాగంగా నాయకులు గ్రామాల్లో ప్రతి ఇంటింటికి వెళ్లి పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్నారు. మండలంలో గల వెంకటనగరం గ్రామంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న, అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు, లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం అనుకున్న సమయానికే పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. అమ్మ ఒడి, రైతుభరోసా, పింఛన్ల పంపిణీ పంపిణీ, ఇళ్ల స్థలాల పంపిణీ, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, ఈబీసీ నేస్తం, మత్స్యకార భరోసా, మత్స్యకారులకు డీజిల్‌పై రాయితీ, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య సురక్ష, జగనన్న సురక్ష తదితర పథకాలు, కార్యక్రమాలు అమలుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

అందుకే మనందరం మరలా జగన్‌మోహన్ రెడ్డికే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాల్మన్‌పేట సర్పంచ్ కోటేశ్వరరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం,నాయకులు వెంకట్, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



పంచదార్ల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాంబిల్లి : జగనన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చూసి మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్ అన్నారు. పంచదార్ల గ్రామంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు వైఫల్యాలను వివరించారు. జగనన్న మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను, అమలు చేసిన వైనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ , ఎంపీటీసీ అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు రమణ, రాజు పాల్గొన్నారు. మామిడివాడ గ్రామంలోనూ శనివారం సచివాలయ కన్వీనర్ మోటూరి రాఘవేంద్ర, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటి ప్రచారం నిర్వహించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

అందరి సంక్షేమం..జగన్‌తోనే సాధ్యం

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రజల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పందూరు గ్రామ సచివాలయం పరిధి రామచంద్రపురంలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు నిర్వహించారు. తొలుత జెండాను ఆవిష్కరించి లబ్ధిదారుల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ పాలన ఉందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసి చిన్నారులకు బంగారు భవితను ఇస్తున్నారన్నారు. దేశ చరిత్రలో లేని విధంగా కార్పొరేట్ వైద్యం పేదల చెంతకే చేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధికి ప్రధాన అంశాలైన విద్య, వైద్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. అర్హత ఉంటే చాలు కులం, మతం, రాజకీయం లేని సంక్షేమం అందుతోందన్నారు. పింఛను కోసం పండుటాకులు పంచాయతీ కార్యాలయాల వద్ద ఎండలో పడిగాపులు కాచే పరిస్థితి ఉండేదన్నారు. ఇపుడు వలంటీర్లే ఇళ్లకు వెళ్లి అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఇవన్నీ యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిల్లాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, చంటి, చవ్వాకుల చిన్న, ఉగ్గిన ఈశ్వరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మునగపాక : ఈ నెల 14న నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు గ్రంథాలయాధికారి ఎల్.వి. రమణ తెలిపారు. వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం జరుగుతుందన్నారు. 15న ఉదయం పుస్తక ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. 16న దేశభక్తి గీతాలు, జానపద గీతాల పోటీలు జరుగుతాయి. 17న కవి సమ్మేళనం, సభ్యత్వ సేకరణ, 18న వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా క్విజ్ పోటీలు జరుగుతాయి. 20న ముగింపు వేడుకల్లో భాగంగా విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన సీఎం



టి.సిరసపల్లిలో బుక్‌లెట్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, పార్టీ శ్రేణులు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని టి.సిరసపల్లిలో వలంటీర్లు,గృహసారథులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి జగనే రాష్ట్రానికి ఎందుకు కావలంటూ ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలకు జగన్‌మోహన్ రెడ్డి హయాంలో మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత తెలుగుదేశం పాలనకు,నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా గమనించి మరోసారి జగన్‌కు అవకాశం కల్పించాలన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు,ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు,పార్టీ నేతలు బొడ్డేడ జగ్గప్పారావు, జగ్గారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వచ్ఛ దీపావళికి సహకరించండి

- మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు
- యలమంచిలిలో స్వచ్ఛ దీపావళి ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు, మున్సిపల్ ఉద్యోగులు

యలమంచిలి : పట్టణంలో ప్రజలందరూ స్వచ్ఛ దీపావళికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. శనివారం యలమంచిలి పట్టణంలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛ దీపావళి జరుపుకోవడంపై మున్సిపల్ ఉద్యోగులు , కార్మికులతో కలసి కమిషనర్ కొండలరావు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కొండలరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలందరూ పర్యావరణానికి అనుకూలమైన స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని , క్లీన్ అండ్ గ్రీన్ శుభ దీపావళి జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ శబ్ద కాలుష్యం అరికట్టాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించడం నిషేధించాలని, ప్రజలందరూ స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీని పట్టణంలో పురపాలక సంఘం నుంచి పాత జాతీయ రహదారి వైఎస్సార్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, శానిటరి అసిస్టెంట్‌లు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ



అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

ఎస్.రాయవరం : పి.ధర్మవరం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గ్యాస్ పైపు లీకై మంటలు చెలరేగడంతో ఓ పూరిగుడిసె కాలి బూడిదయ్యింది. జోగ మంగకు చెందిన ఇంట్లో రాత్రి భోజనాలు చేసే సమయంలో ప్రమాదం జరగడంతో ఇంట్లో నుంచి అందరూ బయటకు పరుగులు తీశారు. గ్యాస్ మంటలు దట్టంగా రావడంతో భయాందోళనకు గురైన స్థానికులు మంటలను అదుపు చేయలేకపోయారు. అయితే చివరిగా గ్యాస్ బండ కూడా పేలినట్టు బాధితులు చెప్పారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణం చేసుకునేందుకు ఇంట్లో భద్రపరచిన రూ. లక్ష రూపాయలు నగదు, 20 తులాల వెండి, కొంత బంగారం మంటల్లో కాలిపోయినట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్ట పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాద బాధితులకు ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు 50 కిలోల రేషన్ నిత్యావసర సరుకులు అందజేశారు. వీరితో పాటు బాధితులను సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు, మాజీ సర్పంచ్ వెదుళ్ల బంగారి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి శ్రీను తదితరులు పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తామన్నారు.

పంచరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాలకు ముస్తాబైన తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారి ఆలయం



భూలోకమాంబ అమ్మవారు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి పంచరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 80 ఏళ్లుగా యలమంచిలి తులసీనగర్ భూలోకమాంబ అమ్మవారు, పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పేర్లతో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకు పట్టణంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా తులసీనగర్, దిమిలి రోడ్డు కూడలి, పాతవీధి, ప్రధాన, అంతర్గత రహదారులకు ఇరువైపులా ఆకర్షణీయంగా భారీ సెట్టింగులు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. భూలోకమాంబ అమ్మ వారిని సాక్షాత్తూ లక్ష్మీదేవి రూపంగా ఇక్కడ భక్తులు భావిస్తారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు, రాత్రులు నూనె దీపాలు వెలిగించి అమ్మవారిని కొలుస్తారు. పంచరాత్రి ఉత్సవాలు ఆదివారం లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. భూలోకమాంబ ఆలయం వద్ద జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆడారి తులసీరావు కుటుంబీకులు పెద్దలుగా వ్యవహరిస్తారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు.


హెటెరో ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డీజీఎంలు సుబ్బారెడ్డి తదితరులు

నక్కపల్లి: మండలంలో రాజయ్య పేటలో హెటెరో రసాయన పరిశ్రమ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.60 లక్షల విలువైన అభివృద్ధి పనులను శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభినట్టు డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయి రెడ్డి తెలిపారు. నూకతాత గుడికి టైల్స్ వేసే కార్యక్రమంతో పాటు, గ్రామంలో సురక్షితమైన తాగునీటి కోసం రూ.50 లక్షల వ్యయంతో ఆర్‌వో ప్లాంటు నిర్మాణ పనులు కూడా ప్రారంభించామన్నారు. అలాగే గ్రామంలో ఇటీవల సుమారు కోటిరూపాయల వ్యయంతో అన్ని వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించడం జరిగిందనితెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డీజీఎంలు రాజారెడ్డి, శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సర్పంచ్ కామేశు, ఎంపీటీసీ సత్తియ్య, గ్రామ నాయకులు పిక్కి రాంబాబు, కోదండ, నాగేశు, స్వామి పాల్గొన్నారు.

ఘనంగా బీసీటీ వ్యవస్థాపక దినోత్సవం



గ్రామ కార్యాచరణ కమిటీ సభ్యులు

రాంబిల్లి: హరిపురం బీసీటీ ప్రాంగణంలో శనివారం 48వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీటీ సంస్థ కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షుడు రావు తట్టపర్తి , పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్ గ్రామాల కార్యాచరణ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. బీసీటీ కార్యక్రమాల్లో గ్రామ కార్యాచరణ కమిటీ సభ్యులు ఎంతో సహకారం అందించారని శ్రీరామ్మూర్తి అన్నారు. బీసీటీ ద్వారా చేసిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా బీసీటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

చంద్రబాబువన్నీ బూటకపు హామీలే



గొడిచర్లలో పథకాలపై ఆరా తీస్తున్న నాయకులు

నక్కపల్లి : గతంలో చంద్రబాబు ఇచ్చినవన్నీ బూటకపు హామీలేనని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి అన్నారు. శనివారం గొడిచర్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అల్లు పార్వతితో కలిసి ఇంటింటికి వెళ్లి గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, జగనన్న ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించి ఈ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకున్నారు. చంద్రబాబు ఇచ్చిన డ్వాక్రా రుణమాఫీ, ఇంటింటికి ఉద్యోగం, తదితర హామీలు నెరవేర్చారా అని ప్రజలను ప్రశ్నించారు. జగనన్న ప్రకటించిన నవరత్నాల్లో ఎన్ని నెరవేర్చారో కూడా అడిగి తెలుసుకున్నారు. దీనిపై లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న ప్రకటించిన ప్రతి సంక్షేమ పథకాన్ని తాము అందుకుంటున్నామన్నారు. చంద్రబాబువన్నీ బూటకపు హామీలేనన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రైతు రుణాలు, డ్వాక్రారుణాల మాఫీ చేయలేదన్నారు. ఓట్లకోసం అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్వాక్రారుణాలు మాఫీ చేశారన్నారు. అమ్మవడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను అందజేస్తున్నారన్నారు. మళ్లీ జగనన్నే మాకు కావాలన్నారు. జేసీఎస్ జిల్లా కన్వీనరు గోవిందు, మండల కన్వీనరు శ్రీను, బూత్ కమిటీ ఇన్‌చార్జ్ రామకృష్ణ, అల్లురమణ పాల్గొన్నారు.

విశ్రాంత డీఎంఅండ్‌హెచ్‌వో మృతికి సంతాపం



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : విశ్రాంత డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పి.ఎస్ సూర్యనారాయణ సేవలు వెల కట్టలేనివని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన డాక్టర్ సూర్యనారాయణ సంతాప సభ శనివారం మండలంలోని గవర్ల అనకాపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సూర్యనారాయణ వైద్య వృత్తికే పేరు తీసుకువచ్చారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించడంలో సూర్యనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నా రు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, మద్దాల వీరునాయుడు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, మాజీ ఎంపీటీసీ దాడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు పాల్గొన్నారు.

నాటక రంగ దర్శకుడు వీరునాయుడు వర్ధంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిన దివంగత వెలగా వీరునాయుడును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకకు చెందిన విద్యాగురువు, నాటకరంగ దర్శకుడు స్వర్గీయ వెలగా వీరునాయుడు వర్ధంతి సందర్భంగా మునగపాకలో ఈ నెల 14న కొత్త పరిమళం నాటిక ప్రదర్శన ఏర్పాటులో భాగంగా శనివారం సంబంధిత కరపత్రాలను ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వీరునాయుడు మాస్టారు సారథ్యంలో ఎంతోమంది పిల్లలు ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పాలసంఘ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, టెక్కలి కొండలరావు, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ బొడ్డేడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.